క్లుప్తంగా

విజయదుర్గా ఆలయంలో చండీ హోమం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం చండీ హోమం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయంలోని అర్ధనారేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి స్వామి వారికి విశేష పూజాభిషేకాలు, అలంకరణ చేశారు. స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న జోగిని శ్యామల



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మను నటి, జోగిని శ్యామల గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జోగిని శ్యామలను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం పండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, చైర్మన్ రాంబాబు అమ్మవారి ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు.

సందడిగా పంజా సెంటర్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మక్కా యాత్రకు వెళ్లి వచ్చిన యాత్రికులతో స్థానిక పంజా సెంటర్ గురువారం సందడిగా దర్శనమిచ్చింది. మొహమ్మదీయ హజ్ ఉమ్రాహ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నగరం నుంచి ఉమ్రా మక్కా యాత్రకు వెళ్లిన ముస్లింలు యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకొని నగరానికి చేరుకున్నారు. యాత్రికులకు కుటుంబ సభ్యులు, నగర ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మెరాజ్ మాట్లాడుతూ గత నెల 31 న ఉమ్మడి కృష్ణ, గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 70 మంది మక్కా యాత్రకు వెళ్లామని చెప్పారు. యాత్ర పూర్తిచేసుకొని విజయవాడ నగరానికి చేరుకున్నామన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి



భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 45వ డివిజన్‌లోగల 137, 138 సచివాలయాల పరిధిలోని సితార కొండ ప్రాంతంలో సమస్యలను తెలుసుకునేందుకు కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీరు, సైడు కాలువలు, డ్రెయినేజీ, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వారు దరఖాస్తు చేసుకోగా వచ్చిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆమె అందచేశారు. ఓటర్ కార్డ్స్ లేవని కొందరు చెప్పటంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి దరఖాస్తు చేయించేలా ఏర్పాటు చేశారు. కొత్తగా వచ్చిన పింఛన్లను లబ్ధిదారులకు అందచేశారు. సమస్యలు తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు. పార్టీ నాయకులు ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి, సుంకర నారాయణ, ముత్యాల రాంబాబు, ముడుపు పద్మ, కోటేశ్వరి, సచివాలయాల సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్‌కు దమ్ముంటే వెలంపల్లిపై పోటీ చేయాలి

వించిపేట(విజయవాడపశ్చిమ):జనసేన అభ్యర్థిగా పవన్ కళ్యాణ్‌కు దమ్ముంటే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి వెల్లంపల్లి శ్రీనివాసరావుపై పోటీ చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దిన్ సవాల్ విసిరారు. ఈ మేరకు గురువారం వించిపేట, నైజాంగేటు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజమండ్రి జైలు వద్ద పవన్ కళ్యాణ్ టీడీపీ, జనసేన కలిసి ముందుకువెళ్తాయంటూ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తొలి నుంచి టీడీపీ తోక పార్టీగా ఉన్న జనసేన అవినీతి కేసులో జైలులో ఉన్న తన దత్త తండ్రి చంద్రబాబును కలిసి ఆయన ఆదేశాల మేరకు పవన్ ముసుగు తీసేసాడని విమర్శించారు.

కొండ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే వెలంపల్లి

వించిపేట(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలసి గురువారం ఆయన 55వ డివిజన్‌లో పర్యటించారు. జరుగుతున్న అభివృద్ధి, చేయాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్‌లో పర్యటించినప్పుడు కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను ప్రజలు తన దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని తుది దశలో ఉన్నాయని తెలిపారు. రెహమాన్‌వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానికులు విజ్ఞప్తి చేయడంతో అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. యుద్ధప్రాతిపాధికన పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

దత్త పుత్రుడు జీర్ణించుకోలేకపోతున్నాడు...

చంద్రబాబు అరెస్టును ఆయన దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ జీర్ణించుకోలేకపోతున్నాడని విమర్శించారు. ముద్రగడ పద్మనాభాన్ని పరామర్శించేందుకు వెళుతున్న ఆయన అన్న చిరంజీవిని అడ్డుకున్నప్పుడు బయటకురాని పవన్ ఆర్థిక నేరంలో చంద్రబాబు జైలుకు వెళితే మాత్రం సహించలేపోవడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ప్యాకేజీ కోసమే చంద్రబాబుతో నడుస్తున్న పవన్ ప్రజాధనాన్ని కొల్లగొట్టిన బాబును వెనుకేసుకొస్తుంటే ఆయనకు కూడా వాటా ఉందనే అనుమానం కలుగుతుందన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు సలీమ్, సుభానీఖాన్, మోషేన్ బాబు, బషీర్, జీవన్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమానికి బాసటగా హిందీ భాష

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):హిందీ భాష భారతదేశ స్వాతంత్రోద్యమానికి బాసటగా నిలిచిందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల హిందీ విభాగ పూర్వ విభాగాధిపతి డాక్టర్ శార్వరి అన్నారు. కేబీఎన్ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హిందీ అవశ్యకత అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ శర్వారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యంతో పాటుగా అనేక జాతీయోద్యమాలకు హిందీ బాసటగా నిలిచిందన్నారు. హిందీ జాతీయ భాషగా ప్రకటించిన నాటి నుంచి సెప్టెంబర్ 14వ తేదీని హిందీ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. హిందీ భాషపై పట్టు సాధించటం వలన దేశంలోని అనేక రాష్ట్రాల్లో చక్కగా జీవించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రజల మధ్య సంధానకర్తగా హిందీ వ్యవహరిస్తుందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా హిందీ భాష అనుకున్న స్థాయిలో విస్తరించలేదన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ హిందీ భాషతో ఉపాధి, ఉన్నతి రెండూ సాధ్యమవుతుందన్నారు. మాతృభాష, అంతర్జాతీయ భాషగా ఉన్న ఇంగ్లీష్‌తో పాటుగా జాతీయ భాష హిందీపై కూడా విద్యార్థులు చక్కని ప్రావీణ్యాన్ని సాధించాలని సూచించారు. తత్ఫలితంగా ఉపాధి అవకాశాల్లో మంచి ప్రోత్సాహంతో పాటుగా చక్కని కమ్యూనికేషన్ స్కిల్స్ అలవడుతాయన్నారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి జె.జానకి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శర్వారి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హెచ్ఎం కోటయ్య

పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ పి.నరేష్ హిందీ భాషా ప్రాధాన్యతను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ):జాతీయ భాష అయిన హిందీ ప్రాధాన్యతను ప్రతి విద్యార్థి గుర్తించి దానిపై మక్కువ పెంచుకోవాలని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య తెలిపారు. జాతీయ హిందీ దివస్ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. హిందీ భాష నేర్చుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భారత రాజ్యాంగంలో ఉన్న త్రిభాషా సూత్రాన్ని పాటిస్తూ జాతీయ భాషను కూడా నేర్చుకోవాలని సూచించారు. రాజ భాషగా పేర్కొన్న హిందీ భాషపై ఆసక్తి పెంచుకుంటే నేర్చుకోవడం చాలా సులువన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హిందీ వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. హిందీ పండితులు డి.కిరణ్ కుమారి, పి.వాణి నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె.నాగరాజు, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

సబ్ కలెక్టర్ అతిథి సింగ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అతిథి సింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):విజయవాడ నగర పాలక సంస్థ, రూరల్ ప్రాంతాల్లోని గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనాలకు సంబంధించి బందోబస్తు తదితర అంశాలపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సబ్ కలెక్టర్ అతిధి సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తు పై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, వీఎంసీ, మెడికల్, ఫిషరీస్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి గణేష్ ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేషన్, రూరల్ పరిధిలో మూడు వేల విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతులు ఇచ్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు, మతపరమైన సమస్యలు లేకుండా అనుమతులు ఇవ్వాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన మూడు, ఐదు, తొమ్మిది, 11వ రోజులలో గణేష్ నిమజ్జనాలు జరుగుతాయని ఆఖరి రోజు ఎక్కువ మంది భక్తులు కృష్ణా నది ఘాట్లకు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ లాండ్ ఆర్డర్ కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘాట్లలో సౌకర్యాలు కల్పించాలి...

ఘాట్ల సౌకర్యాల ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యల కోసం ఇరిగేషన్, వీఎంసీ, రెవిన్యూ, విద్యుత్, ఫిషరీస్, ఫైర్ శాఖలు ముందుగా జాయింట్ పరిశీలన చేసుకోవాలన్నారు. ప్రకాశం బ్యారేజి ఎగువ ప్రాంతాల్లోని ఘాట్లలో బారికేడ్లు ఏర్పాట్లలో ఇరిగేషన్ శాఖ, కార్పొరేషన్ సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన క్రేన్‌లను, సిబ్బందిని, వీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. ఫిషరీస్ శాఖ బోట్ లను, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆయా ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోను, నిమజ్జనాలు నిర్వహించే ఘాట్ల వద్ద కంట్రోల్ రూమ్‌లను రెవెన్యూ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. లైఫ్ జాకెట్‌లతో సిబ్బందిని ఏర్పాటు చేసి ఫైర్ వాహనం సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మేజర్ విగ్రహాలు నిమజ్జనంలో కరెంట్ తీగల తొలగింపుపై విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఘాట్ల వద్ద లైటింగ్ ఏర్పాటుచేయాలన్నారు. కృష్ణ వేణి ఘాట్, పవిత్ర సంగమం వద్ద నిమజ్జనానికి తగు ఏర్పాట్లు చేయాలని ప్రకాశం బ్యారేజి దిగువ భాగాన నిమజ్జనానికి సంబంధించిన ఘాట్ల వద్ద నీటి సమస్య ఉన్నందున విగ్రహాల నిజ్జనానికి వీలుగా నీటి మడుగులు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ అతిధి సింగ్ ఆదేశించారు. డీఆర్వో జి. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

టీడీపీ.. పవన్ వేర్వేరు కాదు.. ఇద్దరూ ఒకటే

మాజీ మంత్రి వెలంపల్లి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ.. పవన్ వేర్వేరు కాదని.. ఇద్దరూ ఒకటేనని, చంద్రబాబు కోసమే పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టాడని.. పవన్ కళ్యాణ్‌కు దమ్ము ధైర్యం ఉంటే తనపై పోటీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ సవాల్ విసిరారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పవన్ కళ్యాణ్‌పై నిప్పులు చెరిగారు. తన అన్నకి సపోర్ట్‌గా నిలవలేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అన్నారు. చంద్రబాబుకి దత్త పుత్రుడు పవన్ కళ్యాణ్ జైలు బయట తన ముసుగు తీశాడన్నారు. చంద్రబాబు నేరం చేశాడని రిమాండ్ విధిస్తే పవన్ కళ్యాణ్ వెనకేసుకు రావటం దిక్కుమాలిన చర్య అన్నారు. నమ్మిన జనసేన నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా పవన్ కళ్యాణ్ సిగ్గులేకుండా చంద్రబాబు కోసమే పరితపిస్తున్నారన్నారు. ఎవరు ఎంత మంది కలిసి వచ్చినా తాము సింగిల్‌గానే పోటీ చేసి సత్తా చూపిస్తామని చెప్పారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్‌ను నమ్ము కున్నాడని తాము మాత్రం ప్రజలనే నమ్ముకున్నామని తెలిపారు. ఒకరితో పెళ్లి మరొకరితో సహజీవనం చేసే వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబు కోసమే పని చేస్తున్నాడని జనసైనికులు ఒకసారి ఆలోచన చేయాలని హితవు పలికారు. జనసైనికులు కూడా పవన్ కళ్యాణ్‌ను తిరస్కరించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):బందరురోడ్డులోని షాపుల యజమానులు వారి షాపుల ముందు విధిగా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సీఐ ఎం.వి.దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం స్టేషన్ పరిధిలో బెంజిసర్కిల్ నుంచి పశువుల ఆసుపత్రి వరకు బందరు రోడ్డులోని షాపుల యజమానులతో సమావేశం నిర్వహించి ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. షాపుల ముందు రోడ్డు మీద పార్కింగ్ చేయకుండా షాపు యజమానులు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్యాకేజీ స్టార్‌కు డీల్ కుదిరింది

ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాజకీయాల్లో ఉనికి కోల్పోయిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోమారు టీడీపీ ప్యాకేజీలకు అమ్ముడు పోయాడని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతమ్ రెడ్డి విమర్శించారు. విజయవాడలో గురువారం గౌతమ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ములాఖ్ పేరుతో పవన్ కళ్యాణ్ చంద్రబాబుతో బేరం కుదుర్చుకున్నట్లు తేటతెల్లమైందన్నారు. పవన్ కళ్యాణ్ మీద నమ్మకం పెట్టుకున్న అభిమానులు, కాస్తో కూస్తో నమ్మిన వాళ్లకు భ్రమలు తొలగిపోయాయని పేర్కొన్నారు. జనసేన, టీడీపీలను మూకుమ్మడిగా రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీతో జనసేన ఒక అక్రమ కలయిక అని ధ్వజమెత్తారు. ఒంటరిగా పోటీచేయలేమని చెప్పకనే చెప్పారన్నారు. రాష్ట్రంలో కోట్లాది మందికి ఏదో ఒక రూపేణా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అందుకే ఆయన తిరుగులేని ప్రజాదరణ కలిగిన నేతగా ఎదిగారన్నారు.

రాష్ట్రంలో 5.50 కోట్ల మంది ఉంటే దాదాపు 5 కోట్ల మందికి ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలు దరిచేరాయన్నారు. పవన్ కళ్యాణ్ మాట్లాడిందంతా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రాసిచ్చిన స్క్రిప్టేనన్నారు. అందులో ఎక్కడా కూడా తన సొంత నిర్ణయం ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదన్నారు.

ప్యాకేజీ బంధం బయటపడింది

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన



భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ – జనసేన ప్యాకేజీ బంధం బట్టబయలైందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్న అవినీతి చక్రవర్తి చంద్రబాబును కలిసిందే ప్యాకేజీని పెంచుకోవడానికని ఎద్దేవా చేశారు. టీడీపీతో పొత్తును ఖాయం చేసుకున్న పవన్ కల్యాణ్‌పై ఇన్నాళ్లూ నమ్మకం పెట్టుకున్న అభిమానులు, కాస్తోకూస్తో అతన్ని నమ్మినవారి భ్రమలను తొలగించేశాడని చెప్పారు. ఇకపై పొత్తులకు, ప్రజలకు మధ్య యుద్ధం జరుగబోతుందని తెలిపారు. పొత్తుల బ్యాచ్‌ని రాష్ట్రం నుంచి తరిమి కొట్టడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

చంద్రబాబు అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి...

అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా కోర్టుల ద్వారా స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు వ్యవస్థలను ఎలా మేనేజ్ చేశాడో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. చంద్రబాబు పట్ల ప్రజల్లో సానుభూతి లేకపోవడంతో టీడీపీ నాయకులే మొక్కుబడిగా నాలుగు గోడల మధ్య ఉద్యమాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

వేగంగా అంబేడ్కర్ స్మృతివనం పనులు

పటమట(విజయవాడతూర్పు):నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతివనం పనులు చురుగ్గా సాగుతున్నాయని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. స్మృతివనం పనులను గురువారం ఆమె పరిశీలించారు. ప్రాజెక్ట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. రాత్రిళ్లు చేస్తున్నారని, నిర్దేశించిన సమయానికి పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. గ్రౌండ్స్ చుట్టూ ఉన్న ప్రదేశాలు, ఫుట్‌పాత్‌లు మరింత అందంగా బ్యూటిఫికేషన్ చేస్తున్నామని చెప్పారు. నవంబర్ 26న స్మృతివనం ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకునేందుకు వీలుగా డిజిటల్ మ్యూజియం, మినీ థియేటర్ నిర్మిస్తామన్నారు. లైటింగ్, గ్రానైట్, పాత్ వే వాటర్ పౌంటేన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.



అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి, స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పూర్తిస్థాయిలో జగనన్న సురక్ష సర్వే

పటమట(విజయవాడతూర్పు): త్వరలో ప్రారంభమయ్యే జగనన్న సురక్ష హెల్త్ క్యాంపునకు పూర్తిస్థాయిలో సర్వే జరగాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి డివిజన్లలో ఉన్న ప్రతి ఇంటినీ సర్వే చేసి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. మొదటి దశలో వలంటీర్లు, వార్డు సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తారని చెప్పారు. ఆరోగ్య సురక్షా కార్యక్రమం జరగబోయే రోజు, తేదీతోపాటు ఏయే కార్యక్రమాలు చేపడతామో ప్రజలకు వివరిస్తామన్నారు. వీటితోపాటు ఆరోగ్యశ్రీ పథకంలో ఎంప్యానెల్ అయిన ఆసుపత్రులు ఎక్కడ ఉన్నాయి ? ఎలా వెళ్లాలి ? ఉచితంగా వైద్యం అందుకోవాలంటే ఆరోగ్యశ్రీని ఎలా వినియోగించుకోవాలన్న అంశాలపై ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి వార్డు వలంటీర్లు, సెక్రటరీలకు, ఆరోగ్య సిబ్బందికి ప్రజాలందరు సహకరించాలని కోరారు.

పశ్చిమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ):ఎన్టీఆర్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ఎస్ఎఫ్ఐ చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్రలో భాగంగా 8వ రోజైన గురువారం విద్యాధరపురం కబేళా వద్ద ఉన్న ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, లేబర్‌కాలనీలోని ఉప్పలపాటి రామచంద్రరాజు మున్సిపల్ హైస్కూల్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్ మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని తదితర డిమాండ్లతో సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలియ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మన్మధ, నాయకులు కుమారస్వామి, కమిటీ సభ్యులు మాధవ్, హేమచంద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనుతో అవ్వాతాతలకు పండుగ



కొత్త పింఛన్‌దారులతో కార్పొరేటర్ రత్నకుమారి, దుర్గారావు, సచివాలయ సెక్రటరీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ కానుక అవ్వాతాతలకు ప్రతి నెలా ఒక పండుగలా ఉంటుందని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. రెండవ విడత కొత్తగా మంజూరయిన పింఛన్లను ఆమె విద్యాధరపురం లేబర్‌కాలనీ కమ్యూనిటీ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందచేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ 139, 156, 157, 158 సచివాలయాల పరిధిలో ఈ నెల 39 మందికి కొత్త పింఛన్లు మంజూరుకాగా ఒకటవ తేదీనే వారికి పంపిణీ చేశామని, రెండవ విడతగా మరో 42 మందికి మంజూరు కావడంతో వారికి అందచేశామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో డివిజన్‌లో 750 మంది మాత్రమే పింఛన్‌దారులు ఉండగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మరో 575 మందికి మంజూరయ్యాయని, మొత్తం మీద ఇప్పుడు 1325కి పెరిగాయని వివరించారు. రెండు విడతలు కలిపి ఈ నెలలో మంజూరయిన కొత్త పింఛన్లు 81 అని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైలవరపు దుర్గారావు, నాయకులు వల్లం రవికుమార్, సచివాలయాల సెక్రటరీలు షరీఫ్, రాజశేఖర్, విజయలక్ష్మి, జగదీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

కృష్ణమాచార్యుల జయంతి పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్: కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు శ్రీమాన్ ఎన్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శతజయంతి సందర్భంగా 16 నుంచి ఐదురోజులపాటు శతజయంతి, సంగీత , సమ్మానోత్సవాలు నిర్వహిస్తునట్లు కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ బుచ్చయాచార్యులు తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని తెలిపారు. సుదీర్ఘకాలం విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేశారని పేర్కొన్నారు. వారి సేవలు నేటి తరానికి స్ఫూర్తి కలిగించడానికి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోజూ 12 గంటలపాటు సంగీత ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కృష్ణామాచార్య కళాపీఠం ఉపాధ్యక్షుడు టీకేవీ రామానుజా చార్యులు మాట్లాడుతూ ఆచార్యులవారి శిష్యప్రశిష్యులు సంగీత కచేరీలు నిర్వహిస్తారన్నారు.